క్లుప్తంగా

ముమ్మరంగా తనిఖీలు



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో ఎస్‌ఐ శ్రీహరి తన సిబ్బందితో పాటు కేంద్ర బలగాలతో కలిసి ప్రధాన రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వాహనాల్లో నగదు, మద్యం తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లే వారు వాటికి సంబంధించిన ఆధారాలు చూపించాలని కోరారు. అందరూ నిబంధనలు పాటించి సిబ్బందిక సహకరించాలన్నారు.

మద్యం పట్టివేత



అమరచింత: పట్టణంలోని కిరాణ షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. పట్టణానికి చెందిన కటిక వెంకటేష్ కిరాణం షాప్‌లో అక్రమంగా మద్యం సీసాలను నిల్వ ఉంచి అమ్ముతుండగా యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా అక్రమంగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, పెంట్లవెల్లి గ్రామాల్లో శుక్రవారం కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్ సిబ్బందితో కలిసి పలు బెల్టు దుకాణాలు, దాబాలలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 11 లీటర్ల సారా, 11 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. వారి వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన మహ్మద్ మహబూబ్ రాంపురం నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పెబ్బేరు పట్టణంలో పోలీసులు ఆపి అనుమతి పత్రాలు చూపమని అడిగారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అభివృద్ధి పేరిట దోపిడీ



వనపర్తి: నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట మంత్రి నిరంజన్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకుడు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక లక్ష్మీకృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన వనపర్తి మండల ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అవినీతి అక్రమాలకు పాల్పడే మంత్రికి ఓడించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన మంత్రి భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆస్పత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిరుపేదలకు నేటికీ నష్టపరిహారం చెల్లించకపోవటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి, వేముల పంచాయతీలను శుక్రవారం ఎంపీడీఓ రాఘవ సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తాగునీరు, విద్యుత్ ఇతర వాటిని పరిశీలించి సరైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం వేములలో నర్సరీని పరిశీలించి బ్యాగులలో మట్టిని సకాలంలో నింపాలని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు నరేష్, అరుణ తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని జల్లాపురం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

అమ్మఒడి కేంద్రాలుగా ‘అంగన్‌వాడీలు’

- పోషకాహారం పంపిణీ
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ఓటర్ లిస్ట్ తయారీలోనూ టీచర్ల భాగస్వామ్యం



చిన్నారులకు ఆహారం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల మహిళల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్రను పోషిస్తున్నాయి. పసిపల్లలకు పౌష్టికాహారం పంపిణీతో పాటు వారికి పూర్వ ప్రాథమిక విద్య అందించడంలో ముందుండి అమ్మఒడి కేంద్రాలుగా సేవలు అందిస్తున్నాయి. అదేవిధంగా మూఢనమ్మకాల నిర్మూలనలో మహిళలను చైతన్యపరచడం, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించడం, ఓటర్ లిస్ట్‌ల తయారీలోనూ అంగన్‌వాడీ టీచర్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారు.

30 కేంద్రాల ద్వారా..

మండలంలోని 14 పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు 565 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు 401 మంది చిన్నారులు, 260 మంది గర్భిణులు, బాలింతలు, 25 మంది తక్కువ బరువు ఉన్న చిన్నారులు ఈ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. 30 కేంద్రాలకు గానూ తొమ్మిది కేంద్రాలకు సొంత భవనాలు, 19 కార్యాలయ భవనాలు, రెండు అద్దె భవనాలు ఉన్నాయి.

ఓటర్ లిస్ట్‌ల తయారీలో

మండలంలో 21,567 మంది ఓటర్లు ఉండగా 28 పోలింగ్ బూతులను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో వలస ఓటర్లు, కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారిని గుర్తించడం, దివ్యాంగ ఓటర్లతో పాటు 80ఏళ్లు పైబడిన వారి జాబితాలను గుర్తించి వారు ఇంటి వద్దనే తమ ఓటును వినియోగించుకునే విధంగా అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్రను పోషిస్తున్నారు.

మహిళలకు చేయూత



గ్రామాల్లో అధిక మొత్తంలో నిరక్షరాస్యులుగా ఉన్న తోటి మహిళలకు ఆరోగ్యం, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై తగు సూచనలు ఇస్తున్నాం. విద్యలో రాణించాలన్న సదుద్దేశ్యంతో పసి పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం.

– చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్, రంగవరం

శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలి



సమాజంలోని రుగ్మతలను పారదోలడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్రను పోషిస్తున్నారు. వారి శ్రమకు తగిన పారితోషికాన్ని అందించినప్పుడు వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. ఓటరు జాబితా తయారీలో అవిశ్రాంతంగా పనిచేశారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు, అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– ఎత్తం మంజుల, మాజీ సర్పంచ్, వీపనగండ్ల

సేవాభావంతో పని చేయాలి



గ్రామాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సేవాభావంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. రాజకీయాలకు అతీతంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేసినప్పుడే అంగన్‌వాడీ టీచర్లకు మంచి గుర్తింపు వస్తుంది. కేంద్రాల్లో అందుతున్న సేవలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు తీసుకువెళ్లి ఉత్తమ ఫలితాలు సాధించాలి.

– లక్ష్మమ్మ, సీడీపీఓ, పెబ్బేరు ప్రాజెక్ట్

50 మందికి తగ్గకుండా కూలీలు పనిచేయాలి



పాన్‌గల్: మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులకు ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా కూలీలు వచ్చేలా ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని వసతులు కల్పించాలని, నర్సరీల్లో నూతన మొక్కల పెంపకానికి అవసరమైన కవర్లు, మట్టిని సిద్ధం చేసుకోవాలని, అసంపూర్తిగా ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్లు, కామన్ ఇంకుడు గుంతలను పూర్తి చేయడం, సెగ్రిగేషన్ షెడ్లల్లో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రచారంలో సిబ్బంది పాల్గొనకూడదని హెచ్చరించారు. సిబ్బంది ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



శాగాపూర్‌లో పైపులైన్ల లీకేజీ నీటిని పరిశీలిస్తున్న ఏఎన్‌ఎం సుమిత్ర

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చని శాగాపూర్ ఏఎన్‌ఎం సుమిత్ర అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండలంలోని శాగాపూర్‌లోని పలు కాలనీల్లో పర్యటించి పరిసరాల శుభ్రత, కీటకజనిత వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. పలు కాలనీల్లో తాగు నీటి పైపులైన్ల లీకేజీలు ఉన్నాయని, వాటిని మరమ్మతు చేపట్టాలని ఆమె సర్పంచ్‌ను కోరారు. వ్యాధులు సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నిల్వ నీటిలో దోమల లార్వాను నిర్మూలించుటకు అబ్బేట్ ద్రావణాన్ని కలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

చెక్‌డ్యాంను తొలగించాలి



మాట్లాడుతున్న నాయకులు

చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చెక్‌డ్యాం ప్రమాదంగా మారిందన్నారు. గ్రామసమీపంలో నిర్మించడంతో పక్కన ఉన్న శ్మశాన వాటికలోకి చెక్‌డ్యాం నీరు చేరి దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. నీరు చేరడం వల్ల శవాలు తేలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం చెక్‌డ్యాంలో ఉన్న బోరు పంపులనుంచే గ్రామానికి మంచినీరు అందుతోందని.. తాగితే ప్రజలకు రోగాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని.. లేనిచో ఈనెల 5, 6 తేదీల్లో చింతకుంట బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ కన్వీనర్ కుర్వర మేష్, మండల అధ్యక్షుడు దశరత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలి

కొల్లాపూర్: ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కొల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైహిమూదా బేగం, ఆమె భర్త ఖాదర్‌పాషా కోరారు. శుక్రవారం వారు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ మారామనే అక్కసుతో తమపై ఎమ్మెల్యే అనుచరులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. చౌటబెట్ల శివారులోని 104 సర్వే నెంబర్ గల భూమిని చట్టప్రకారం కొనుగోలు చేశామని, అందులో కబ్జాలో ఉన్న వారికి ఎమ్మెల్యే తండ్రి తమ నుంచి డబ్బులు ఇప్పించారన్నారు. ఆ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి వేరే స్థలంలో ప్లాట్లు చూపించామన్నారు. ఎస్‌ఐ బాల వెంకటరమణ తమపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు మేకల నాగరాజు మాట్లాడుతూ భూకబ్జాలకు పాల్పడుతున్నది ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డేనన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలస్వామి, నయూమ్, సారంగి వెంకటేశ్వర్లు, కర్ణాకర్ తదితరులున్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

బిజినేపల్లి: రైతులకు నాసిరక విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ రమేష్‌బాబు, ఏఓ నీతి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వ్యవసాయ దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు ఆగ్రో సేవా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు.

అభివృద్ధిపై రాద్ధాంతం చేయడం తగదు



వెల్టూర్‌లో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి



పాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల

కొత్తకోట రూరల్: సీఎం కేసీఆర్ పాలనలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కనిమెట్ట, పాతజంగమాయపల్లి, రామనంతాపూర్, పాలెం, నిర్వేన్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం ఆశీర్వాదంతో దేవరకద్ర నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఉమ్మడి జిల్లాలో ఎక్కడ లేని విధంగా చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టి దేవరకద్రకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, భీంరెడ్డి, కొండారెడ్డి, మోహన్‌కుమార్, గాడీల ప్రశాంత్, చాపల రామకృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌జీ, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు

మంత్రి నిరంజన్‌రెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెల్టూర్‌లో జెడ్పీటీసీలు రఘుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నిరంజన్‌రెడ్డి వనపర్తి నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, రాజకీయ ఉనికిని చాటుకోవడానికి మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ద్వారా పెద్దమందడి మండలంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించి బీడుపడిన పొలాలను పచ్చగా చేసిన ఘనత నిరంజన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజప్రకాష్ రెడ్డి, వేణుయాదవ్, దయాకర్, విట్ట శ్రీనివాస్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, శివశంకర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ్లు తరలిరావాలి

పెబ్బేరు రూరల్: మండలంలోని వై.శాఖాపూర్, రామమ్మపేట, తోమాలపల్లి, రాంపురం గ్రామాల్లో శుక్రవారం మండల గౌడ సంఘ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, స్థానిక గౌడ సంఘం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. నవంబర్ 5న వనపర్తిలో జరిగే గౌడ్ల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని గౌడ్లు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, బస్వరాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, జనార్ధన్‌గౌడ్, యాదగిరిగౌడ్, గోపాల్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

మోసపూరిత హామీలు నమ్మొద్దు

పెంట్లవెల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న మోసపూరిత హామీలు నమ్మొద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా ప్రజలను మాయమాటలతో కాలం వెళ్లదీశారని ఆరోపించారు. జూపల్లి కృష్ణారావు భారీ మెజారిటీతో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, సర్పంచ్ గోపినాయక్, మాజీ సర్పంచ్ కోట్లసురేందర్, రామన్‌గౌడ్, నరేష్, వెంకటయ్యలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పెద్దకొత్తపల్లి: మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సిద్దార్థ, శివుడు తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. సహకార సంఘం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని తరలించి విక్రయించుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఖాళీ బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టి కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ. 2180 చెల్లిస్తారని వివరించారు. సంఘం సీఈఓ బషీర్, స్టాఫ్ అసిస్టెంట్ గోవిందరాజు, ఏఈఓ శ్రీజ రైతులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధికి మరోమారు పట్టం కట్టండి



జానంపేటలో మాట్లాడుతున్న తేజశ్రీ



ఆత్మకూర్‌లో..

ఖిల్లాఘనపురం: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి మరోసారి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కూతురు డాక్టర్ ప్రత్యూష అన్నారు. గురువారం రాత్రి మండలంలోని అప్పారెడ్డిపల్లిలో పల్లె నిద్ర చేపట్టిన ఆమె శుక్రవారం ఉదయం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనెమోని కృష్ణవేణి, ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, , జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పురుషోత్తం, పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలను పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసునాయుడు, హన్మంతురెడ్డి, నర్సింహ్మా, పరమేష్, కుర్మయ్య, గంగన్న, నాగన్న, మౌలాలి, వినోద్‌గౌడ్, వెంకటేష్, రాంగోపాల్, రామకృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఓటర్లను కోరారు. శుక్రవారం మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో, గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో మంత్రి నిరంజన్‌రెడ్డి కూతురు తేజశ్రీ, మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలసి శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెబ్బేరు సింగిల్ విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై సమరశంఖం పూరిద్దాం



మదనాపురంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మక్తల్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని కత్తెపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, పరమేష్, శ్రీను, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, గంగాధర్, వెంకటన్న, అజమ్మత్, జుబేర్, అక్బర్, శంషీర్ తదితరులు ఉన్నారు.



వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కత్తేపల్లి గ్రామస్తులు

మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు లక్ష్మయ్యతో పాటు 60 మంది కార్యకర్తలు, మండల కేంద్రానికి చెందిన ఉద్యమ నాయకుడు గోపాలకృష్ణ దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టేందుకు సకల జనులు ఏకం అవుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తాం

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో శివశంకర్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కొండపురం రాము, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, లక్ష్మీనారాయణ, ఎల్లన్న, రాజు ఉన్నారు.

